క్లుప్తంగా

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత



నగరంపాలెం: ఇటీవల ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ) మాధవస్వామి, ఫిరంగిపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్ల (పీఎస్) కానిస్టేబుళ్లు ఎస్.రాజేష్, కిషోర్‌లు అనారోగ్య కారణాలతో వేర్వేరుగా మృతిచెందారు. డిపార్ట్‌మెంట్ పరంగా మంజూరైన ఒక్కొక్క లక్ష రూపాయాల చెక్కులను మాధవస్వామి కుమారుడు సదానందం, రాజేష్ భార్య జ్యోతి, కిషోర్ భార్య సుధారాణిలకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరోగ్యరాజు, ఉపాధ్యక్షుడు ఆర్ఐ రాజారావు, కరిముల్లా, హుస్సేన్ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల మధ్య సౌభ్రాతృత్వం వెల్లివిరియాలి

అవగాహన సంస్థ సభ్యుల విజ్ఞప్తి

లక్ష్మీపురం: ఆంధ్ర, తెలంగాణ యువ ముఖ్యమంత్రులు ఇప్పుడైనా సహృద్భావంతో చర్చించుకుని ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య సౌభ్రాతృత్వం వెల్లివెరిసేలా రేవంత్‌రెడ్డి కృషి చేయాలని విశ్రాంత అధికారి సి.హెచ్. ప్రసాద్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించి కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరు వాగ్దానాలలో రెండింటిని ప్రారంభిస్తూ సంతకం చేయడం శుభారంభమన్నారు. ప్రగతి భవన్ ముందున్న బారికేడ్లను ముళ్ళకంచెలను తొలగించి ఒక స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పరచడం మంచి పరిణామమన్నారు. అయితే తెలుగు ప్రజల మధ్య సఖ్యతను నెలకొల్పడానికి సమైక్యత సాధించడానికి ఉభయ రాష్ట్రాల ప్రభుత్వాలకు ఇదొక మంచి అవకాశామని అంతరాష్ట్ర జల వివాదాలు, సరిహద్దు తగాదాలు ఎవరికీ మేలు చేయవని తెలుసుకోవాలన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, న్యాయవాది అవధానుల హరి మాట్లాడుతూ రాష్ట్ర విభజన గాయాల మూలంగా తలెత్తిన విభేదాలను చల్లార్చి సామరస్యత నెలకొల్పడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతని అయితే కేంద్రం తన బాధ్యతలను విస్మరించి తెలుగు వారిని ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. ఉభయ రాష్ట్రా మధ్య కేంద్రం పెడుతున్న చిచ్చును గర్తించి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సందర్భంలోనైనా చర్చించుకోవాలన్నారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు ప్రసంగించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా

జిల్లా సంయుక్త కలెక్టరు రాజకుమారి

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యతలను వెలికి తీసివారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పాటు పడుతోందని జిల్లా సంయుక్త కలెక్టరు రాజకుమారి పేర్కొన్నారు. రూరల్ మండలంలోని వెంగళాయ పాలెం, చల్లవారి పాలెం సచివాలయాలను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్లు సచివాలయాల స్థాయిలో సిబ్బంది ఏ విధంగా చేస్తున్నారో పరిశీలించారు. క్రీడల వారీగా ఖో ఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ క్రీడలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జట్ల కూర్పును ఏ విధంగా చేస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి తగిన సూచనలు చేశారు. క్రికెట్ ఇతర క్రీడలకు సంబంధించి పురుషులు, స్త్రీల జట్లను విడివిడిగా రిజిస్టర్ చేయాలన్నారు. ఖో ఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ క్రీడలకు సంబందించి వలంటీర్ల సహాయంతో క్రీడల్లో ఉత్సాహంగా ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిని రిజిస్టర్ చేయాలని సిబ్బందికి చెప్పారు.

చిత్రలేఖనంతో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: చిత్రలేఖన కళ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం బృందావన్‌గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించనున్న 18వ జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల ప్రచార పోస్టర్‌ను ఎమ్మెల్యే గిరిధర్‌రావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్ర కళా నైపుణ్యం ద్వారా మేధస్సు అభివృద్ధి చెందు తుందన్నారు. జూనియర్, సీనియర్ చిత్రకారులకు తమలోని వృత్తి నైపుణ్యాన్ని అభివృద్ధి పరచుకోవడంలో ఇటువంటి పోటీలు ఒక వేదికగా ఉపయోగపడతాయన్నారు. క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ కేపీ బాబు మాట్లాడుతూ ఆర్ట్స్ కాంపిటీషన్‌లో పాల్గొనదలచిన కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు, జూనియర్ సీనియర్ చిత్రకారులు జనవరి 10లోపు తమ ఎంట్రీలను పంపాలని సూచించారు. ఆర్ట్ ఎగ్జిబిషన్‌తో పాటు బహుమతి ప్రధానోత్సవాన్ని జనవరిలో నిర్వహిస్తామని, పాల్గొనదలచిన చిత్రకారులు 9885377653 నంబర్లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డి. ప్రవీణ్‌కుమార్, కె. బాబూరావు, పి, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనన్నకే పట్టం కట్టాలి

- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు
- 83వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం



లబ్ధిదారులకు నవరత్నాల ప్రగతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, కార్పొరేటర్ అడకా పద్మావతి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వమూ అమలు పర్చని విధంగా నవరత్నాల ద్వారా ప్రజలకు చేసిన సంక్షేమాభివృద్ధిని కొనసాగించేందుకు వై.ఎస్.జగన్‌కే తిరిగి పట్టం కట్టాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ అంకమ్మనగర్ 83వ వార్డు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ అడకా పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు నవరత్నాల పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి, గృహ సముదాయాలవద్దకు గడప–గడపకు పర్యటించి సీఎం వై.ఎస్.జగన్ పరిపాలనపై ప్రజాభిప్రాయ మద్దతు తీసుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు నవరత్నాల లబ్ధికి సంబంధించి ప్రగతి పత్రాన్ని అందజేశారు.

సీఎం వై.ఎస్.జగన్ ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన మంచిని వివరిస్తూ, ప్రజాభిప్రాయ సేకరణ కోసం చేపట్టిన కార్యక్రమమే జగనే ఆంధ్రాకు ఎందుకు కావాలి అనే కార్యక్రమం అని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వమే అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏ స్థాయిలో, ఏఏ వర్గాలకు చెందుతున్నాయో అనే అంశంపై ఆరా తీసి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలైన నవరత్నాలు తదితర అంశాలు ప్రజాదరణ పొందుతూ ప్రజల్లో జగన్‌పై నమ్మకం కుదిరించుకుంటూ అభివృద్ధి దృష్టితో పయనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం నాడు–నేడు కార్యక్రమం అనేక రకాలైన హామీలను నెరవేరుస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడంలో ఆయన చేస్తున్న కృషికి ప్రజలందరు తమ మద్దతు తెలియజేయాలని కోరారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా తమకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రజలు ధీమాగా చెబుతున్నారని తెలిపారు. రాష్ట్రంతో పాటు గుంటూరు నగరాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ క్లస్టర్–2 ఇన్‌చార్జ్ సురసాని వెంకటరెడ్డి, షేక్ బాజీ, కన్వీనర్ మామిడి కిషోర్, నాగయ్య, అనిల్, సునీల్, బ్రహ్మం, సింగు నరసింహరావు చౌదరి, శారదాలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్: గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 20వ డివిజన్ పీకలవాగు కట్టపై 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు స్థానిక ప్రజలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని 20వ డివిజన్ పీకలవాగు కట్టపై సీసీ రోడ్డు నిర్మించేందుకు శంకుస్థాపన చేశామని, ఇప్పటికే సదరు ప్రాంతంలోని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటి పన్నులు వేయించామని, అంతే కాకుండా తాగునీటి పైప్ లైన్లు కూడా వేయించామన్నారు. నగరంలో అన్ని వార్డులలో అభివృద్ధి పనులు కుల మత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నగరంలోని ప్రధాన రహదారుల విస్తరణ పనులు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, అదే విధంగా నగరాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కంతేటి శ్యామ్ శేఖర్, ఖాజా మొహిద్దీన్, గేదెల రమేష్, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఎస్.హెచ్.ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ తాతా సేవ కుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక 2/1 బ్రాడీపేటలోని ఎస్ హెచ్ ఓ భవనంలో ప్రారంభమయ్యే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ డి .అమర్ పాల్గొంటారన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు

గుంటూరు మెడికల్: గుంటూరు వారితోట 7 వ లైన్‌లోని కేర్ వెల్ హాస్పిటల్ ఆవరణలో ఈనెల 9న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డయాబెటాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగూర్ భాష శుక్రవారం తెలిపారు. ఒక్కో పేషంట్‌కు సుమారు రూ.10 వేల విలువ చేసే ఫైబ్రో స్కాన్ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయటం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు 8341713713, 9854757999 నంబర్లకు సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ముందుకుసాగాలి

వ్యక్తిత్వ వికాస నిపుణుడు మానస్ మిశ్రా



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకై కృషి, పట్టుదల, దీక్షతో ముందు కు సాగాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మానస్ మిశ్రా పేర్కొన్నారు. శుక్రవా రం పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో ''వ్యక్తిగత విజయాలు-వృత్తి విజయాలు'' అనే అంశంపై విద్యార్థులకు అతిథి ఉపన్యాసమిచ్చారు. ఈసందర్భంగా మానస్ మిశ్రా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తాను జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలనే లక్ష్యంగా పెట్టుకోవాలని, దానిని చేరుకునేందుకు సరైన ప్రణాళిక, కృషితో ముందుడుగు వేయాలని సూచించారు. అకుంఠిత దీక్షతో ప్రయత్నిస్తే తప్పక విజయం సాధిస్తారని చెప్పారు. పిల్లలు గొప్పవారిగా ఎదగాలనేది తల్లిదండ్రులు కోరుకుంటారని, వారు గర్వపడేలా విద్యార్థులు గొప్ప స్థానాలకు చేరుకోవాల ని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ గొప్ప లక్ష్యాన్ని సాధించేందుకు అనుసరించే మార్గం సైతం ఉన్నతంగా ఉండాలని, అప్పుడే ఆ స్థానానికి ఒక విలువ ఉంటుందని అన్నారు. విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ వ్యక్తిగత, వృత్తి పరమైన విజయాలను సాధించేందుకు వ్యక్తిగత, వృత్తి పరమైన ప్రాధాన్యతల సమతుల్యంతో ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి, డాక్టర్ యు.రవికుమార్ డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, డాక్టర్ నిర్మలారాణి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనతోనే ఉన్నత శిఖరాలు

- ర్యాగింగ్ రహిత యూనివర్సిటీగా ఏఎన్‌యూ
- వర్సిటీలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పన
- పోటీ పరీక్షలకు ప్రత్యేక కార్యాచరణ
- వీసీ ఆచార్య పి.రాజశేఖర్



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, వేదికపై రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ: నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగితేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల పీజీ మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం, ర్యాగింగ్ వ్యతిరేక అంశాలపై అవగాహన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ ర్యాగింగ్ రహిత యూనివర్సిటీగా ఏఎన్‌యూ ప్రత్యేకతను సొంతం చేసుకుందన్నారు. విద్యార్థులకు యూనివర్సిటీలో పూర్తి స్వేచ్ఛ ఉందని, దాని ని దుర్వినియోగం చేసుకోకుండా నడచుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. సీనియర్లు, జూనియర్లు అనే బేధం, తారతమ్యాలు చూపకుండా అందరూ స్నేహభావంతో మెలగాలన్నారు. యూనివర్సిటీలోని ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరగతి గదులు, వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామన్నారు. కోర్సులకు సంబంధించిన బోధనతోపాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ, ప్రతి వసతి గృహంలో ఏసీ రీడింగ్ రూం మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. లక్షకు పైగా పుస్తకాలతో ఉన్న లైబ్రరీ విద్యార్థులకు అందుబాటులో ఉందని వారికి కావలసిన విజ్ఞానాన్ని లైబ్రరీలో పొందవచ్చన్నారు. సమాజంలో, వ్యక్తిగత జీవితంలో అన్ని మార్పులకు విద్య కారణమనే వాస్తవాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. విశ్వవిద్యాలయం త్వరలో నాక్ రి అక్రిడేషన్‌కు వెళ్లనుందని అందులో ఏ డబల్ ప్లస్ అత్యున్నత స్థాయి ర్యాంకును సాధించే ప్రక్రియలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి మాట్లాడుతూ వర్సిటీలో అకడమిక్ క్యాలెండర్‌ను అమలు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిపూర్ణ పారులను తీర్చిదిద్దేందుకు యూనివర్సిటీ ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ యూనివర్సిటీలో అందరికీ సమాన ప్రాధాన్యత ఉంటుందన్నారు. వర్సిటీ వసతి గృహాల్లో మంచి పోషకాలు కలిగిన ఆహారం, ఆల్కలైన్ వాటర్ ఫెసిలిటీ కల్పిస్తున్న ఏకైక యూనివర్సిటీ ఏఎన్‌యూ అన్నారు. లక్ష్యాలను సాధించేందుకు దోహదం చేసే సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య గంగాధర రావు, వార్డెన్లు ఆచార్య నాగరాజు, ఆచార్య వెంకట రత్నమ్మ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఫార్మా రంగంలో భారత్‌ది ప్రత్యేక స్థానం

- ఏఎన్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ అనిత
- చలపతిలో జాతీయ సదస్సు ప్రారంభం



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరురూరల్: ఫార్మా రంగంలో ప్రపంచంలోనే భారతదేశం ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జి అనిత అన్నారు. నగర శివారు లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సును శుక్రవారం ఆమె ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన బయోఫోర్ ఇండియా ఫార్మాసూటికల్స్, సిండి ఫార్మా, విజె ఇన్‌స్ట్రూమెంట్స్ ఐవీవై, ఓవర్‌సిస్, లియో ఓవర్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నైతిక విలువలకు పట్టం కడుతూ నాణ్యమైన మందులు ఉత్పత్తికి, సరఫరాతోపాటు పేషెంట్ కౌన్సెలింగ్ వరకూ వివిధ రంగాల్లో మన దేశం దూసుకుపోతుందన్నారు. హైదరాబాద్ బయోలాజికల్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ ధర్మేష్ పటేల్ మాట్లాడుతూ నావెల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ ద్వారా నూతన పరమాణువులు, ఆవిష్కరణ ప్రక్రియనుంచి నూతన ఔషధాలను తయారు చేయటం ద్వారా ఎన్నో వ్యాధులకు సత్వర చికిత్స అందించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్‌లు అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భర్త, అత్తమామలపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్ : తనను భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ వివాహిత నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం నగరంపాలెంలో నివాసం ఉంటున్న వివాహిత తన అత్తమామలు, భర్త తరచూ వేధింపులకు గురిచేస్తున్నారు. అదనపు కట్నం తేవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఈవిషయంపై బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: మహిళను దూషించిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంపాలెంలో నివాసం ఉంటున్న మహిళ గురించి గణేష్ అసభ్యకర ప్రచారం చేస్తున్నాడు. గణేష్‌ను ఈవిషయంపై బాధిత మహిళ ప్రశ్నించింది. దీంతో గణేష్ మహిళను దూషించాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్‌యూలో ఫొటోగ్రఫీ విభాగం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు నూతన విభాగాన్ని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఫొటోగ్రఫీ పితామహునిగా పేరొందిన ప్యారిస్‌కు చెందిన డాకేరే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఫొటోగ్రఫీలో ఉన్న ఆధునిక టెక్నాలజీలు, ఫొటోగ్రఫీ ప్రారంభం నుంచి నేటి వరకు వచ్చిన మార్పులు తదితర అంశాలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వీసీ తిలకించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ కోర్సు ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే విశేషమైన స్పందన లభించిందన్నారు. ఈ కోర్సులో ఇప్పటికే 30 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందడం అభినందనీయమన్నారు.. ఏడాది నిడివి గల ఈ కోర్సు చేసిన వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. ఫొటోగ్రఫీ అనేది అభిరుచి గల కోర్సు అని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ అనిత, డాక్టర్ జె మధుబాబు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకు సాగుదాం

శాసనమండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి



మాట్లాడుతున్న విప్ అప్పిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ మండల అధ్యక్షులు, బస్సుయాత్ర ఇన్‌చార్జ్‌లు, గృహసారథుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తూ.. మరోవైపు దొంగ ఓట్లు తొలిగించే ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. డబుల్, త్రిబుల్ రిజిస్టర్ అయిన ఓట్లు తొలిగించే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో ఈనెల 24వ తేదీలోపు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ మండల అధ్యక్షులు, బస్సుయాత్ర ఇన్‌చార్జ్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.

అవగాహన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈ.ఆర్.ఓ. కీర్తి చేకూరి



ఈవీఎంను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఓటర్లు ఈవీఎం, ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్‌పై జీఎంసీ ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈ.ఆర్.ఓ. కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్‌పై అవగాహన కలిగించడానికి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అవగాహన కేంద్రాల్లో శిక్షణ పొందిన సిబ్బంది ఆఫీస్ పని వేళల్లో అందుబాటులో ఉండి ఈవీఎం ద్వారా ఓటు వేయడం, సరి చూసుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. పోలింగ్ రోజు ఈవీఎం ద్వారా ఓటు వేయడంపై గందరగోళం లేకుండా ఉండడానికి అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశామని, కేంద్రాలు ఫిబ్రవరి నెలాఖరు వరకు ఉంటాయని, నగరంలోని రెండు నియోజకవర్గాల ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్లు తమ ఓటుకు సంబంధించిన ఏ సందేహం ఉన్నా తీర్చడానికి వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ని ఏర్పాటు చేశామన్నారు. తూర్పు నియోజకవర్గానికి 0863-2345104, పశ్చిమ నియోజకవర్గానికి 2345105 నంబర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఈ.ఆర్.ఓ., అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివ జ్యోతి, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

దీక్షాపరులకు అన్నదానం ఏర్పాటు

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తులసి ధర్మచరణ్ తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): స్థానిక నెహ్రూనగర్ కోదండ రామాలయంలో వేద సీడ్స్ ఆధ్వర్యంలో దీక్ష స్వీకరించిన స్వాములకు ఏర్పాటు చేసిన చద్ది కార్యక్రమాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహా నైవేద్యం సమర్పించి దీక్ష స్వీకరించిన స్వాములకు చద్దిని వడ్డించారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడు తూ అన్ని దానాల్లో కల్లా అన్నదానం మంచి కార్యక్రమమని, మాల ధరించిన వారికి అన్నదానం చేయ టం మహాభాగ్యమన్నారు. నగరంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమాలకు దాతల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాలను మహా యజ్ఞంలా భావించి అన్ని చోట్ల విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఆ ధునిక కాలంలో భగవన్నామ స్మరణ ఎంతో మనశ్శాంతిని అందిస్తుందన్నారు. ఎన్నో సంవత్సరాలు గా ఆళ్ల శ్రీను స్వామి నెహ్రూ నగర్‌లో పూజా, సేవా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నా రంటూ అభినందించారు. కార్యక్రమంలో అయిశెట్టి శ్రీనివాసరావు, బండి రామ ప్రభు, యర్రగోపు నాగేశ్వరరావు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

రక్తదానం మహా పుణ్యకార్యం

కొరిటిపాడు(గుంటూరు): అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ ఏదోఒక సమయంలో రక్తం దానం చేయడం వల్ల ప్రాణదాతలుగా నిలుస్తారని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. స్థానిక లక్ష్మీపురంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి రోహిణి కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ధర్మచరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వారు ప్రతి సంవత్సరం డిసెంబర్ 8వ తేదీన రక్తదాన శిబిరం కార్యంపు నిర్వహించడం, సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు, ప్రభుత్వ ఆధీనంలోని బ్లడ్ బ్యాంకులకు పంపడం చాలా మంచి విషయమని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్స్ బి.అరుణ్‌కుమార్, పి.యువటూరి, బ్రాంచి మేనేజర్ బి.వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలు ఖరీదు చేసే 150 మొబైల్‌ఫోన్లు అప్పగింత

బాధితుల్లో ఆనందం



మొబైల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనాథ్

నగరంపాలెం: సెల్‌ఫోన్ పోగొట్టుకుని ఫిర్యాదు చేసే ప్రతి ఒక్కరికీ తిరిగి వారి మొబైల్ ఫోన్లను అప్పగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. సుమారు రూ.40 లక్షలు ఖరీదైన వివిధ బ్రాండెడ్ సెల్ కంపెనీల 150 మొబైల్ ఫోన్లను శుక్రవారం బాధిత ఫిర్యాదిదారులకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో అప్పగించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ మాట్లా డుతూ మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారి సౌకర్యార్థం ఈ ఏడాది మొదట్లో పోలీస్ వాట్సాప్ నంబర్ 8688831574ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఎటువంటి ఎఫ్ఐఆర్‌లు లేకుండానే పెద్దఎత్తున మొబైల్‌ఫోన్లను వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి, బాధితులకు అప్పగిస్తున్నామని చెప్పారు. పలుమార్లు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు వెళ్లి కూడా ఫోన్లను రికవరీ చేసి అప్పగించామని అన్నారు. ఇటీవల మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న ఫోన్లను సైతం తీసుకొచ్చి అందజేశామని తెలిపారు. ఈ వాట్సాప్ నంబర్‌ను గుంటూరు జిల్లాతోపాటు ఇతరత్రా జిల్లాల ప్రజలు సైతం పోలీస్ మొబైల్ వాట్సాప్ నంబర్, సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్ ద్వారా మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సెల్‌ఫోన్లల్లోని సమాచారం దుర్వినియోగం కాదని, తద్వారా సెల్‌ఫోన్లు బ్లాక్ అవుతాయన్నారు. అదే విధంగా పోగొట్టుకున్న ఫోన్లను త్వరితగతిన రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. పలువురు ఫోన్లను తీసుకున్న బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం టీపీడబ్ల్యూ (టెక్నికల్ అనాలిసిస్ వింగ్), ఐటీ కోర్ బృంద సభ్యులను జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఎస్బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం, ఆర్ఐ రాజారావు, ఐటీ కోర్ ఎస్ఐ శ్రీనాథ్, ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి పాల్గొన్నారు.